
సాక్షి గుంటూరు

శుక్రవారం ¦ 21 ¦ మార్చి ¦ 2025



హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 10వ అండర్-19 జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు విజయవాడ ఆంధ్రా లయోల కాలేజీ ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుడివాడకు చెందిన సుంకర బాలాంబ కుటుంబం రూ. 2,00,116 విరాళాన్ని అందజేసింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
గుంటూరు	6.24	4.55
నరసరావుపేట	6.26	4.57
బాపట్ల	6.24	4.55

న్యూస్‌రీల్

చర్లపల్లి-కన్యాకుమారి మధ్య సమ్మర్ వారాంతపు రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి-కన్యాకుమారి వయా గుంటూరు డివిజన్ మీదుగా ఏప్రిల్ 2 నుంచి జూన్ 25 వరకు ప్రత్యేక రైలు(07230) ప్రతి బుధవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి రాత్రి 9.50 గంటలకు బయలుదేరి రెండో రోజు అర్ధరాత్రి 2.30 గంటలకు కన్యాకుమారి స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. అలాగే కన్యాకుమారి-చర్లపల్లి రైలు(07229) ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 ప్రతి శుక్రవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు కన్యాకుమారి స్టేషన్ నుంచి తెల్లవారుజామున 5.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.

జయ గోవర్ధనా.. నారసింహా



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి గోవర్ధనోద్ధరణ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శెనగల రామహనుమాన్, శేషాంజనేయ గోపాల్ వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు వ్యవహరించారు. శుక్రవారం స్వామి గజేంద్రమోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఖాళీ స్థానాలకు 27న ఉప ఎన్నికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఈనెల 27న ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీలను పరోక్ష విధానంలో ఎన్నికల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించిన అనంతరం మధ్యాహ్నానికి ఎన్నిక, ప్రమాణ స్వీకారంతో ప్రక్రియ ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉప ఎన్నికల ద్వారా దుగ్గిరాల మండల పరిషత్ అధ్యక్ష, గుంటూరు రూరల్ మండల పరిషత్ ఉపాధ్యక్ష స్థానాలతో పాటు తెనాలి మండల నుంచి కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌లకు స్థానాల వారీగా కొల్లిపర మండలం తూములూరు, చక్రాయపాలెం, మేడికొండూరు మండలం గుండ్లపాలెం, మేడికొండూరు, దుగ్గిరాల మండలం మంచికలపూడి, ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం, పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు, చేబ్రోలు మండలం శ్రీరంగాపురంలో ఎన్నికలు జరగనున్నాయి.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని 24 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతి (ఇంటర్మీడియేట్) ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ టి.వి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 7,8, 9, 10,12 తరగతుల్లోనూ మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులను https//apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. వివరాలకు 9704100406, 9440642122 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కార్మికులతో ఇదేమి ఆటో!

- ఇచ్చిన వాగ్దానాలన్నీ బుట్టదాఖలే!
- వాహన మిత్ర సంగతే మరిచిన బాబు సర్కార్
- జీఓ నంబర్ 21, 31 రద్దుకు ఆటోవాలాల డిమాండ్

కూటమి సర్కారు 'బేకార్' హామీలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఎన్నికల వేళ ఇచ్చిన హామీలకు కూటమి సర్కారు తూట్లు పొడుస్తోంది. కార్మికులు, ప్రజల జీవితాలతో ఆడుకుంటోంది. అధికారంలోకి రాగానే వాహన మిత్ర అందిస్తామని డ్రైవర్లను నమ్మించింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఆ సంగతే మాట్లాడడం లేదు.

గుంటూరు జిల్లాలో సుమారు 25 వేలకుపైగా ఆటోలు ఉంటాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆటో, కారు డ్రైవర్ల సంక్షేమానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ఏటా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ 10 వేల ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్నారు. ఈ మొత్తాన్ని ఆటోవాలాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ), ఇన్సూరెన్స్, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకునేవారు. దీంతో పాటు నవరత్నాల ద్వారా అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలూ డ్రైవర్ల కుటుంబాలకు అందేవి. అయితే గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నమ్మబలికారు. వాహనమిత్ర కూడా అమలు చేస్తామని చెప్పారు. అదంతా నిజమని కోటి ఆశలు పెట్టుకున్న వాహనదారులకు ఇప్పుడు నిరాశే ఎదురైంది. సంక్షేమ పథకాలు అందకపోగా.. పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. దీనికితోడు భారీ జరిమానాలతో రవాణాశాఖ జులు విదులుస్తోంది. దీంతో వాహనదారులు, ఆటోడ్రైవర్లు, మోటార్ వర్కర్లు లబోదిబోమంటున్నారు. ఎన్నికల హామీల అమలు, తమ డిమాండ్ల సాధనకు ఇప్పటికే కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెలఖారులో విజయవాడలో జరగనున్న ఆటో డ్రైవర్ల రాష్ట్ర మహాసభల్లో సర్కారు తీరును ఎండగట్టాలని కార్మికులు ఐక్యంగా నిర్ణయించారు.



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిచి ఉన్న ఆటోలు

వైఎస్ జగన్ హయాంలో వాహనమిత్ర లబ్ధి ఇలా..

సంవత్సరం	వాహనదారులు	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
2019-20	20,594	20.95
2020-21	25,177	25.18
2021-22	23,837	23.84
2022-23	12,137	12.13
2023-24	12,540	12.54
ఐదేళ్లలో మొత్తం		94.64

భారీగా జరిమానాల పెంపు

కూటమి సర్కారు వచ్చాక జీవో నంబర్ 21 అమలు చేస్తూ భారీ జరిమానాలతో వాహనదారుల నడ్డి విరుస్తోంది. గతంలో డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.500 నుంచి రూ.750 వరకు జరిమానాలు విధించేవారు. ప్రస్తుతం జీవో నంబరు 21 వచ్చాక డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు, పర్మిట్ లేకపోతే రూ.10 వేలు, ఇన్సూరెన్స్ లేకుంటే రూ.3 వేల నుంచి రూ.5 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.3 వేల నుంచి రూ.5 వేలు, ఫిట్నెస్ లేకపోతే రూ.5 వేలు జరిమానా విధిస్తున్నారు.

ప్రైవేటు చేతికి ఫిట్నెస్ పరీక్షలు

రవాణా రంగంలో ఉన్న ఆటో, వ్యాన్లు, కార్లు వంటి వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని ఫిబ్రవరి నుంచి ప్రైవేటు ఏజెన్సీకి కూటమి సర్కారు అప్పగించింది. ఏటా అవసరాన్ని బట్టి ఫీజు పెంచుకునే వెసులుబాటూ కల్పించింది. గతంలో ఫిట్నెస్ ఫీజు రూ.700 ఉండగా దానిని రూ.800కు పెంచారు.

ఎన్నికల సమయంలో బాబు హామీలు

- బ్యాడ్జి కలిగిన అన్ని వాహనాల డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం
- భారీ జరిమానాలకు కారణమయ్యే 21, 31 జీవోలు రద్దు
- డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు
- డీజిల్, పెట్రోల్ ధరల తగ్గింపు
- టాటా మ్యాజిక్ వ్యాన్లు, జీపులు, కార్లకు గ్రీన్ ట్యాక్స్, లేబర్ ట్యాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోల్‌గేట్ ఫీజుల తగ్గింపు
- డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు
- చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు

చంద్రబాబుకు డ్రైవర్లంటే చిన్నచూపు



చంద్రబాబు నాయుడికి ఎప్పుడూ ఆటో డ్రైవర్లంటే చిన్నచూపు. వీరి సంక్షేమం కోసం ఏ రోజూ ఆలోచించ లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తొమ్మిది నెలలు గడిచినా అమలు చేయలేదు. ప్రభుత్వ తీరుతో కార్మికులు నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది.

– శేషగిరి పవన్‌కుమార్ (వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు)

రవాణా రంగం నిర్వీర్యం



ప్రైవేటు రైడ్ యాప్స్ వచ్చాక ఆటో డ్రైవర్లు బేరాలు లేక నష్టపోతున్నారు. రోజంతా తిరిగితే రూ.300 కూడా మిగలట్లేదు. భారీ జరిమానాలు చెల్లించలేకపోతున్నాం. గత ప్రభుత్వం ఏటా రూ.10 వేలు వాహనమిత్ర ద్వారా ఇచ్చేది. ఈ సర్కారు రూపాయి సాయం చేయలేదు. పైగా రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది.

– షేక్ సంధాని, ఆటోడ్రైవర్, గుంటూరు

ఉపాధికి గండి



ప్రైవేట్ రైడ్ యాప్స్ వచ్చాక ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడింది. భారీ జరిమానాలూ కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం మా సంక్షేమంపై దృష్టి సారించాలి. ఎన్నికల హామీలు నెరవేర్చాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా వాహనమిత్ర అమలు చేస్తే కొంత ఆర్థిక భరోసా లభిస్తుంది.

– ఎస్.నరసింహారావు, ఆటోడ్రైవర్, గుంటూరు

జాతీయ రహదారి భూముల పరిశీలన



ఫిరంగిపురం: నేషనల్ హైవే అథారిటీ ఇండియా ఆదేశాల మేరకు వినుకొండ నుంచి గుంటూరు జాతీయ రహదారి నంబరు 544డీని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు సేకరించే భూములను గురువారం జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. పొనుగుపాడు, మేరికపూడి, రేపూడి, నుదురుపాడు, వేమవరం, ఫిరంగిపురం, అమీనాబాద్ గ్రామాల్లోని భూములను చూసి రైతులతో మాట్లాడారు. సర్వే చేసే విషయం గురించి వారికి అవగాహన కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.ప్రసాదరావు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, ఆయాగ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మేడికొండూరు మండలంలో..

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు ప్రాంతాల్లోనూ భూములను జేసీ పరిశీలించారు. రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మేడికొండూరు తహసీల్దార్ ఎం.హరిబాబు, మండల సర్వేయర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

1,48,601 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,42,015 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,48,601 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,200 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 60,317 బస్తాలు నిల్వ ఉంది.

మిర్చి యార్డులో వ్యాపారులకు లైసెన్సు తప్పనిసరి

- జీరో, కటింగ్ వ్యాపారం, మచ్చుకాయల దోపిడీకి అడ్డుకట్ట
- మల్టిపుల్ లైసెన్స్‌దారులపై చర్యలు
- ఇప్పటికే 134 మందిని గుర్తించాం
- మరో 27 మంది జాబితా తయారు చేశాం
- మరోసారి తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం
- నిర్లక్ష్య ధోరణి, అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు
- మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా మిర్చి వ్యాపారం చేసే వారి వల్ల ధర ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావుతో కలిసి యార్డు అధికారులు, సిబ్బందితో గురువారం విజయ సునీత సమీక్ష నిర్వహించారు. ఒకే కుటుంబంలో రెండు, మూడు లైసెన్స్‌లు ఎలా ఇచ్చారని అధికారులు, సిబ్బందిని వివరణ అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా యార్డులో జరిగిన, జరుగుతున్న అక్రమాలు, జీరో వ్యాపారం, కటింగ్ వ్యాపారం, మచ్చు కాయల దోపిడీపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ నిర్లక్ష్య ధోరణి గల, అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యార్డులో జరుగుతున్న వ్యవహారాలకు అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యార్డులో లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించే వారిపై.. వ్యాపారం చేస్తూ చేయనట్టు చూపించే వారిపై.. గత రెండు, మూడు నెలలుగా తాము అడుగుతున్న సమాచారం ఇవ్వని దిగుమతి, ఎగుమతి వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఒకే కుటుంబంలో మల్టిపుల్ లైసెన్స్‌లు కలిగి చట్టబద్ధంగా వ్యాపారం చేయకుండా ఐటీ ఎగ్గొట్టే ధోరణితో వ్యవహరిస్తున్న మిర్చి కమీషన్ ఏజెంట్స్‌పై దృష్టి సారించడంతో పాటు వారి జాబితాను రూపొందించామని చెప్పారు. వాటన్నింటినీ క్రాస్ చెక్ చేసి 134 మందిని తేల్చామని పేర్కొన్నారు. దీంతోపాటు మరో 27 మంది జాబితా కూడా తయారు చేశామన్నారు. వీటన్నింటినీ మరోసారి క్రాస్ చెక్ చేసి వారిపై చర్యలు తీసుకోవడానికి జాబితా రూపొందిస్తున్నట్లు వివరించారు. యార్డులో జీరో వ్యాపారం, కటింగ్ వ్యాపారం, మచ్చుకాయల దోపిడీకి అడ్డుకట్ట వేసి యార్డును మరింత ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. యార్డులో వ్యాపారం చేసే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని ఆదేశించారు. గుంటూరు యార్డుకు కర్ణాటక రాష్ట్రం నుంచి అధికంగా మిర్చి బస్తాలు రావడం కారణంగా లోకల్ ఉత్పత్తిపై ఆ ప్రభావం పడి మిర్చి ధర తగ్గే అవకాశం కనిపిస్తోందని తెలిపారు. అధికారులు, వ్యాపారులు, సిబ్బంది అందరూ కలసికట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించి మిర్చి రైతులకు మంచి ధర కల్పించేలా చూడాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజబాబు, మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, అసిస్టెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షల ఆదాయం

అమరావతి: అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షలు ఆదాయం వచ్చింది. ఆలయంలో దుకాణాలకు గురువారం బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు పాటదారులు వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు. ఆలయంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడాన్ని రూ. 9.51లక్షలకు, ఆవరణలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, పార్కింగ్ రుసుం వసూలును రూ.10.61లక్షలకు, బొమ్మలు అమ్ముకునే హక్కుకు రూ.3.90 లక్షలకు, నదీ తీరంలో కూల్‌డ్రింక్స్ షాపునకు రూ.9.9లక్షలకు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు రూ. 2.66 లక్షలకు, తలనీలాలకు రూ. 20వేలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహణకు రూ. 1.5లక్షలకు పాడుకున్నట్లు ఆయన వివరించారు. స్వామికి ఆదాయం గత ఏడాది రూ. 49.44 లక్షలు రాగా ఈ ఏడాది రూ.54.22 లక్షలు వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ.4.78 లక్షలు అధికంగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సిండికేట్‌తో ఆదాయానికి గండి

పాటదారులు సిండికేట్ కావడంతో అమరేశ్వరుని ఆదాయానికి గండిపడింది. ఒకటి, రెండు వ్యాపారాలకు తప్పా మిగిలిన అన్నింటిలో పాటదారులు సిండికేట్ అయ్యారు. అధికారులు కూడా పార్కింగ్, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు అధిక మొత్తంలో పాట పెంచారు. మిగిలిన వ్యాపారాలకు తక్కువ మొత్తంలో పెంచి మమ అనిపించారు. ఈ విధంగా దేవుని ఆదాయానికి గండి కొట్టటం దారుణమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

రెచ్చిపోయిన 'పచ్చ' నేత

- అధికార అహంకారంతో పేదల గుడిసెలు కూల్చివేత
- ఆందోళనకు దిగిన బాధితులు

నకరికల్లు: అధికార అహంకారంతో తమ గుడిసెలను కూల్చేసిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు ఆందోళనకు దిగారు. గుడిసెలు కూలగొట్టి భూమిని లాక్కోవాలని చూస్తున్నాడని మండలంలోని బాలాజీనగర్ తండాకు చెందిన పలువురు సుగాలీలు పీడీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట, ఆందోళనకు దిగారు. బాధితుల తరపున పీడీఎం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడారు. తండాకు చెందిన 37 సుగాలి కుటుంబాలకు మూడు సెంట్లు చొప్పున 1989లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అంతా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాట్రావత్ సాంబయ్య నాయక్ 2022లో గుడిసెలకు నిప్పంటించాడు. అతనిపై కేసు నమోదు కాగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాడు. అనంతరం తిరిగి సుగాలీలకే పట్టాలు మంజూరు చేయాలని హైకోర్టు నుంచి జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. దీంతో కొందరు తిరిగి గుడిసెలు నిర్మించుకొని నివాసముంటున్నారు. అప్పటి నుంచి ఊరుకున్న సాంబయ్య నాయక్ ప్రస్తుతం టీడీపీ అండతో, తండాలో ఎవరూలేని సమయం చూసుకొని పొక్లెయిన్‌తో గుడిసెలను కూలగొట్టాడు. దీంతో బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కోర్టు ఉత్తర్వుల ఉన్నప్పటికీ గుడిసెలు కూల్చిన సాంబయ్య నాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కె.పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.శివానాయక్, పీడీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పి.రామునాయక్, పి.సాంబబాయి, కేతావత్ శ్రీరాములు నాయక్, వి.బాలసింగ్‌నాయక్, కె.కృష్ణనాయక్, కె.రమాదేవి, ఆర్.హనుమానాయక్, ఆర్.మణిబాయి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు, పీడీఎం నాయకులు

కోర్టు ఆదేశాల మేరకు చర్యలు

బాలాజీనగర్‌తండాకు చెందిన ఎస్టీలు ఇచ్చిన అర్జీని పరిశీలించాను. భూ సమస్యపై ఇరువర్గాలు హైకోర్టుకు వెళ్లాయి. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– కె.పుల్లారావు, తహసీల్దార్, నకరికల్లు

వైఎస్ జగన్‌పై పోస్టులు పెడితే సహించం

- పోలీసులు పక్షపాతం వహిస్తున్నారు
- ప్రతిపక్ష నేతల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నాగనారాయణ మూర్తి

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సహించేది లేదని వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకిరెడ్డి నాగ నారాయణ మూర్తి హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై, మాజీ మంత్రి రోజాపై అసభ్య పోస్టులు పెట్టిన కొందరిపై గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నేతలు ఫిర్యాదు చేస్తే క్షణాల్లో కేసులు నమోదు చేస్తున్నారని, ప్రతిపక్ష నేతలు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష నేతలను పోలీసులు వేధిస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు కొండమడుగుల సుధాకర్ రెడ్డి, అడ్వకేట్ నారాయణ రెడ్డి, ముదిగొండ ప్రకాష్, గంజి షణ్ముఖ, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నాగ నారాయణ మూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు

ఆరోగ్యశాఖ పరిధిలోకి చేర్చండి

మంగళగిరిటౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎంలను ఆరోగ్యశాఖ పరిధిలోకి మార్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి ఆటోనగర్‌లోని విశాలాంధ్ర ముద్రణా కార్యాలయం నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.



ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 7,000 గరిష్టం : రూ. 8,500

మోడల్ ధర రూ. 7,800

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 243 బస్తాలు వచ్చాయని, పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 196 బస్తాలు వచ్చాయని, కనిష్ట ధర రూ.9,150 గరిష్ట ధర రూ.9,950 మోడల్ ధర రూ.9,950 పలికినట్లు వివరించారు. కాయలు 47 బస్తాలు వచ్చాయని, కనిష్ట ధర రూ.9950 గరిష్ట ధర రూ.10,000 మోడల్ ధర రూ.9,950 పలికినట్లు వెల్లడించారు. మొత్తం 182.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు.

గుంటూరులో హ్యాకింగ్ చిత్రం షూటింగ్



నగరపాలెం(గుంటూరు వెస్ట్): సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా 'హ్యాకింగ్' పేరుతో చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకులు నరేష్ దోనే, మణివరన్ తెలిపారు. అనుపమ ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్న 'హ్యాకింగ్' ఓటీటీ చిత్ర సన్నివేశాలను గురువారం గుంటూరు నగరంలోని రాజేంద్రనగర్, ఎల్ఐసీ కాలనీ పరిసరాల్లో చిత్రీకరించారు. అనంతరం చిత్రబృందం మీడియాతో మాట్లాడింది. ఇదో విభిన్న కథాంశమని, సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయని దర్శకులు వివరించారు. ఇటీవల కొన్ని సన్నివేశాలను కొండవీడులో చిత్రీకరించామని వెల్లడించారు. ముంబైకి చెందిన నటి కావ్య దేశాయ్ ఈ చిత్రంలో నటిస్తున్నట్లు వివరించారు. తదుపరి చిత్రీకరణ అంతా లంబసింగి, అరకులోయ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లో చేస్తామని చిత్ర నిర్మాత రావూరి సురేష్‌బాబు తెలిపారు.

గెలుపు 'భానోదయ'ం

- అకుంఠిత దీక్షతో ఆశయ సాధన..
- తొలియత్నంలోనే గ్రూప్–1లో విజయం
- సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ స్థాయికి ఎదిగిన భానోదయ
- కూచిపూడిలో నృత్యంలో గిన్నిస్ బుక్ రికార్డు




అకుంఠిత దీక్షతో గెలుపుతీరాలను చేరొచ్చని నిరూపించారు భానోదయ. తండ్రి మరణించినా ఆమె కుంగిపోలేదు. మొక్కవోని ధైర్యంతో.. తల్లి ప్రోత్సాహంతో ముందడుగు వేశారు. తన కోసం తల్లి పడే కష్టాన్ని చూసి చదువుతోపాటు కూచిపూడి నృత్యంపైనా శ్రద్ధపెట్టారు. నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు చలించిన ఆమె వాటి నివారణకు తనవంతు కృషి చేయాలని తలంచి గ్రూప్–1కు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ప్రస్తుతం గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమె పూర్తి పేరు గొందేశి భానోదయ.

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): విశాఖ ప్రాంతానికి చెందిన గొందేశి భానోదయ తండ్రి రమణారెడ్డి స్టీల్‌ప్లాంటులో చిరుద్యోగి. ఈమెకు తల్లి, ఓ సోదరి కూడా ఉన్నారు. చిన్ననాటి నుంచి కూచిపూడి నాట్యంపై అభిరుచితో తర్ఫీదు పొందారు. సిలికాన్ ఆంధ్ర సంస్థ వెయ్యి మందితో నిర్వహించిన నృత్య పోటీలో భానోదయ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 2011లో గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకున్నారు. 2012లో కూచిపూడిలో డిప్లమా సాధించారు. 2013లో తండ్రి మరణించడంతో తల్లి వెంకటలక్ష్మి ఇంటి బాధ్యతలు భుజాన వేసుకున్నారు. ఇద్దరు కూతుళ్ల విద్యాభ్యాసంపై దృష్టిపెట్టారు. తల్లి ప్రోత్సాహంతో 2018లో ఎంఏ పూర్తిచేసిన భానోదయ సివిల్స్ సర్వీసెస్‌కు శిక్షణ తీసుకున్నారు. తొలి ప్రయత్నంలోనే గ్రూప్–1 మెయిన్స్ పూర్తిచేశారు. రిజల్ట్ పెండింగ్ పడింది. 2020లో హైదరాబాద్‌లో నిర్మాణ రంగ వ్యాపారం చేస్తున్న రామ్‌మనోహర్‌తో పెళ్లయింది. 2022లో గ్రూప్–1 ఫలితాలు వచ్చాయి. భానోదయ విజయం సాధించారు. డీఎస్పీగా శిక్షణ పూర్తిచేసుకుని తొలుత గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భానోదయ, రామ్‌మనోహర్ దంపతులకు మూడేళ్ల కుమార్తె జష్‌రిత ఉన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తూ..



సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న గొందేశి భానోదయ



భర్త రామ్‌మనోహర్, కుమార్తె జష్‌రితతో..

తల్లి, భర్త ప్రోత్సాహంతోనే ఈస్థాయికి..

సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు బాధ కలిగిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు నా వంతు కృషి చేయాలని పోలీస్ శాఖ వైపు అడుగులు వేశా. నా తల్లి వెంకట లక్ష్మి నా భర్త రామ్‌మనోహర్ ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చా. యువత దృఢమైన ఆశయంతో కష్టపడితే గెలుపు తీరాలకు చేరడం సులువే.

– గొందేశి భానోదయ, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ

క్రేన్ సంస్థల్లో కొనసాగుతున్న ఐటీ దాడులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): క్రేన్ సంస్థల్లో మూడో రోజు ఆదాయపు పన్ను శాఖ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన సోదాలు గురువారం కూడా కొనసాగాయి. ఐటీ అధికారులు క్రేన్ సంస్థల డైరెక్టర్లు, బంధువులు, సన్నిహితుల నివాసాలలో తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికే బంగారం, వెండి, నగదును సీజ్ చేసినట్లు సమాచారం. వంద మంది ఐటీ అధికారులతో బృందాలుగా ఏర్పడి సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గుంటూరు నగరంలోని సంపత్‌నగర్, శ్యామలానగర్, పాత్తూరు ఫ్యాక్టరీలలో పని చేసే వారినీ వదిలి పెట్టకుండా విచారణ చేస్తున్నట్టు సమాచారం. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను సీజ్ చేసి రోజు వారి ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంక్ లాకర్లలో ఉన్న బంగారం, వెండి, అలాగే నగదుపై పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. శ్యామలా నగర్‌లోని ఇంట్లో ఐటీ అధికారులు సుమారు 20 మందికిపైగా సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉరి వేసుకుని జార్ఖండ్ యువకుడు మృతి

తాడేపల్లిరూరల్: అంజిరెడ్డి కాలనీకి వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని చూసి స్థానికులు గురువారం ఉదయం తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ ఖాజావలి మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. యువకుడి జేబులో ఉన్న ఆధారాలను బట్టి యువకుడి పేరు సులేమాన్ తిర్కా అని, జార్ఖండ్‌లోని గుమ్మెల్లి వాసి అని గుర్తించారు. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్టు టికెట్ ఉండడంతో ఉదయం కృష్ణాకెనాల్ జంక్షన్ వద్ద దిగి ఇక్కడ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, జార్ఖండ్‌లో ఉన్న అతడి బంధువులను సంప్రదించడానికి యత్నిస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీబీటీ హాల్ టికెట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఎయిడెడ్ విభిన్నప్రతిభావంతుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈనెల 24న నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత టెస్టు (సీబీటీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్ టిక్కెట్లను విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. https://cse.ap.gov.in, https://deoguntur.blogspot.com సైట్‌ల నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, ఆన్‌లైన్ విధానంలో జరిగే పరీక్షకు హాజరు కావాలని, ఇతర వివరాలకు 95733 82616, 93476 97308 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జయహో భారత్..జయహో సునీత !

100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి, విద్యార్థులు

అచ్చంపేట: మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ తొమ్మిది నెలల తరువాత సురక్షితంగా భూమిపైకి తిరిగి వచ్చిన సందర్భంగా మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు 100మీటర్ల జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి మాట్లాడుతూ సునీత విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి వచ్చిన క్షణాలు అద్భుతమని, ఆమె ధైర్య సాహసాలు అనితరసాధ్యమని కొనియాడారు. ఈ విజయం యావత్ భారతావని గర్వించదగినదని పేర్కొన్నారు. సునీత విలియమ్స్ భారతదేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని తెలిపారు. జయహో భారత్..జయహో సునీత విలియమ్స్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అగస్టీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊయలే ఉరి తాడైంది !

ఆగిన బాలుడి ఊపిరి



అద్విక్‌రెడ్డి మృతదేహం

రెంటచింతల: ప్రతి రోజూ సరదాపడి ఊగే ఊయలే తన ప్రాణం తీస్తుందని ఆ బాలుడు ఊహించలేకపోయాడు. రోజూ మాదిరే ఇంట్లో చీరతో ఊయల కట్టుకుని ఊగుతున్న సమయంలో మెడకు బిగుసుకుని ఊపిరాడక మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా రెంటచింతలలో చోటుచేసుకుంది. వెంకటేశ్వరస్వామి మాణం కాలనీకి చెందిన సలిబండ్ల అద్విక్‌రెడ్డి(11) ఆరోగ్యం బాగో లేదని చెప్పి గురువారం పాఠశాలకు వెళ్లకుండా, అమ్మమ్మ ఇంటి పైగదిలో చీరతో కట్టిన ఊయల ఊగుతున్నాడు. మధ్యాహ్నం అన్నం తినడానికి కిందకు అద్విక్‌రెడ్డి రాకపోవడంతో అమ్మమ్మ కటకం శౌరీలు పైకి వెళ్లి చూసింది. ఊయల చీర అద్విక్‌రెడ్డి మెడకు బిగుసుకుని పోయి ఉండటం గమనించి కేకలు వేసింది. బంధువులు వెంటనే స్థానిక వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అద్విక్‌రెడ్డి స్థానిక ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి నిర్మలరాణి అదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తోందని. తల్లి, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడ వారిని కంట తడి పెట్టించింది. విద్యార్థి అద్విక్‌రెడ్డి అకాలమృతికి పాఠశాల డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, హెచ్ఎం ఏరువ స్టేఫీ స్టార్ సంతాపం తెలిపారు. పాఠశాలకు సెలవు ప్రకటించారు.

కిలోన్నర గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలో గురువారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసి కిలోన్నర గంజాయిని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలోని పాగుబడిన కోళ్ల ఫారంలో గంజాయిని దాస్తుండగా పోలీసులు దాడి చేశారు. గమనించిన నిందితులు అక్కడే వదిలేసి పారిపోయారు. పోలీసులు కిలోన్నర గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ పారిపోయిన వారి కోసం పోలీసు బృందాలు, ఈగల్ టీంలు గాలిస్తున్నాయని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

న్యాయవాదుల క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు చంద్రశేఖర్–9 జట్టు



గుంటూరు న్యాయవాదుల జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న జడ్జిలు సత్యవతి, శరత్‌బాబు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో గుంటూరు చంద్రశేఖర్–9 జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గురువారం సాయంత్రం ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి, నాలుగో అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్ బాబు ట్రోఫీలను బహూకరించారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు న్యాయవాదుల జట్టుతో నరసరావుపేట న్యాయవాదుల జట్టు తలపడింది. తొలుత టాస్ గెలిచిన నరసరావుపేట జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు న్యాయవాదుల జట్టుకు ఓపెనర్లు అంచుల రామాంజనేయులు (47 బంతుల్లో 59 పరుగులు), మహమ్మద్ మాజ్ (27 బంతుల్లో 48 పరుగులు) నిలకడైన ఆటతీరుతో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన జట్టు కెప్టెన్ చంద్ర శేఖర్ రెడ్డి (26 బంతుల్లో 65 పరుగులు), సాజిద్ (20 బంతుల్లో 30 పరుగులు) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో గుంటూరు న్యాయవాదుల జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లకు 221 పరుగులు చేసింది. నరసరావుపేట జట్టులోని ఖాదర్, కిరణ్, సూర్యలకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నరసరావుపేట జట్టు 17.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో పది ఓవర్లకు 110/1 పరుగులతో పటిష్ట స్థితిలో ఉన్న నరసరావుపేట జట్టును గుంటూరు జట్టు బౌలర్ సాజిద్ కుప్పకూల్చాడు. సాజిద్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు కూల్చాడు. నరసరావుపేట జట్టులో అధికంగా యశ్వంత్ 20 పరుగులు, రవి 44 పరుగులు, మధు 32 పరుగులు చేశారు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసి బ్యాటింగ్లో 30 పరుగులు సాధించిన గుంటూరు న్యాయవాదుల జట్టు ప్లేయర్ సాజిద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. నాలుగు రోజులుగా గుంటూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో బాపట్ల, వినుకొండ, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరుల నుంచి మొత్తం ఎనిమిది న్యాయవాదుల జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లలో బాపట్ల జట్టుతో పోటీపడి నరసరావుపేట జట్టు విజయం సాధించగా, వినుకొండ జట్టుతో పోటీపడిన గుంటూరు జట్టు విజయం సాధించింది. ఈ రెండు జట్ల మధ్య గురువారం ఫైనల్ జరిగింది.

కిమ్స్ శిఖర హాస్పిటల్లో అత్యాధునిక గుండె చికిత్సలు



వైద్యులు డాక్టర్ అజ్బర్ జమాన్‌తో డాక్టర్ హరిత, డాక్టర్ శివప్రసాద్, తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో మూడు సంక్లిష్టమైన కరోనరీ ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్లు విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ చేయకుండానే ఆధునిక సాంకేతిక వైద్య పద్ధతులతో కరోనరీ రక్తనాళాల్లో ఉన్న అవరోధాలను స్టంట్‌ల సాయంతో తొలగించి ఇంటర్వెన్షనల్ కార్డియాలజీకి కొత్త ముద్రను వేశారు. ఈ విషయాన్ని గురువారం కార్డియాలజీ వైద్యులు మీడియాకు వెల్లడించారు. గుండెకు వెళ్లే రక్తనాళాల్లో అడ్డంకులు ఉండి, తీవ్రంగా కాల్షియం పెరిగిన రోగులు ముగ్గురు చికిత్స కోసం వచ్చినట్లు చెప్పారు. కిమ్స్ శిఖరలో అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాల సాయంతో ముగ్గురికి గుండె చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. ఆపరేషన్లతో పనిలేకుండా స్టెంట్లతో చికిత్సను అందించామన్నారు. యూకే నుంచి వచ్చిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అజ్బర్ జమాన్ నేతృత్వంలో ప్రొసీజర్లు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇంట్రాకరోనరీ అల్ట్రాసౌండ్, కొత్త కట్టింగ్ బెలూన్లు, మైక్రో–క్యాథెటర్స్, డ్రగ్–ఎల్యూషన్ బెలూన్‌ల వంటి ఆధునిక పరికరాల సాయంతో ఆపరేషన్ లేకుండా గుండె సమస్యలను తొలగించామని పేర్కొన్నారు. కిమ్స్ శిఖర కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత, కాథ్‌ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ శివప్రసాద్ చికిత్స విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ మునుపటి రోజుల్లో ఇలాంటి సమస్యలకు శస్త్రచికిత్స కోసం పంపించాల్సిన ఉండేదన్నారు. ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో అత్యంత తక్కువ ఆపరేషన్ అవసరం కలిగిన చికిత్సలను అందిస్తున్నామన్నారు. నూతన చికిత్స పద్ధతుల ద్వారా రోగులు త్వరగా కోలుకుంటారని వెల్లడించారు.

ఎంఈఓ–2 పోస్టును ఎంఈఓ అకడమిక్‌గా మార్చాలి



సమగ్రశిక్ష ఏఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డితో టీవీ రామకృష్ణ, రాయల సుబ్బారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంఈఓ–2 పోస్టులను ఎంఈఓ అకడమిక్‌గా మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎంఈఓ–2 సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ రామకృష్ణ, రాయల సుబ్బారావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజుతోపాటు విజయవాడలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డిని వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఎంఈఓ–1, 2 పోస్టుల్లో ఖాళీలు ఏర్పడినప్పుడు ఆయా పోస్టులను భర్తీ చేసే సమయంలో అదే మండలంలో పని చేస్తున్న ఎంఈఓలకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. మండల పరిధిలో సీనియర్ ఎంఈఓకు డీడీఓ అధికారాలను అప్పగించడంతోపాటు సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులుగా ఎంఈఓ–2, గ్రేడ్–2 హెచ్ఎంలకు అవకాశం కల్పించాలన్నారు. అధికారులను కలిసిన వారిలో ఎంఈఓ–2లు అలీం, శంకర్‌రాజు, శ్రీనివాసరెడ్డి, జయంతి బాబు, నాగేంద్రమ్మ, లీలారాణి, జాకబ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వర్గీకరణ పేరుతో కూటమి చిచ్చు

- త్వరలో లక్షలాది మందితో హలో మాల.. చలో రాజధాని కార్యక్రమం
- మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్



రోడ్డుపై బైఠాయించిన నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను శాసనసభ, మండలిలో ఆమోదించిన కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ మండిపడ్డారు. మాలమహానాడు ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో హలో మాల.. చలో రాజధాని పేరుతో లక్షలాది మందితో మాలల సింహగర్జన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గోదాజాన్‌పాల్, దారా హేమప్రసాద్, పిల్లి మేరి, ఏసుబాబు, బోరుగడ్డ రజనీకాంత్, రాచకొండ ముత్యాలరాజు, బండ్లమూడి స్టాలిన్, నల్లపు నీలాంబరం, సముద్రాల కోటి, డేవిడ్ విలియమ్స్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ దీపిక తదితరులు

పెదకాకాని: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో జరిగింది. పెదకాకాని సుందరయ్య కాలనీకి సమీపంలో రైల్వేట్రాక్‌పై మృతదేహం ఉన్నట్లు గురువారం తెల్లవారుజామున పైలెట్ ద్వారా గుంటూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి రైల్వే ఎస్ఐ కె.దీపిక సిబ్బందితో చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి సమీపంలో డ్రైవింగ్ లైసెన్స్ కనిపించడంతో దాని ఆధారంగా మృతుడు పెదకాకానికి చెందిన పంది గోపీకృష్ణ(32)గా గుర్తించారు. మృతుడి కాళ్ళు, చేతులు దూరంగా పడి ఉన్నాయి. మృతుడి తండ్రి సాంబశివరావు నాలుగేళ్ళ కిందట మరణించారు. గోపీకృష్ణకు తల్లి జ్యోత్స్న, తమ్ముడు ఉన్నారు. గోపీకృష్ణ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ దీపిక తెలిపారు.

సాగర్ డ్యాంను సందర్శించిన సీఈ

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం ఎడమ వైపున ఎర్త్ డ్యాంపై ఎండిపోయిన కార్పెట్ గ్రాస్‌కు బుధవారం సాయంత్రం నిప్పంటుకుని పూర్తిగా తగలబడింది. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం నల్లగొండ జిల్లా చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్, సాగర్ డ్యాం సర్కిల్ ఈఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జునరావు, ఇంజనీర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాను నిలిపి వేశామని, తిరిగి లైన్లు కలిపితే ఏమేరకు నష్టం జరిగిందో తెలుస్తుందని చెప్పారు. కేబుల్స్ కాలిపోయినా, సీసీ కెమెరాలు బాగానే ఉన్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో జరిగిన నష్టాన్ని త్వరలో తేలుస్తామని, తిరిగి కేబుల్స్‌ను ఆధునీకరిస్తామని చెప్పారు. ఈసారి అగ్ని ప్రమాదాలు జరిగినా నష్టం జరగకుండా జీఏ పైపుల నుంచి హెచ్‌డీ పైపులు వేసి, అందులో నుంచి కేబుల్స్ వచ్చేలా చూస్తామని ఆయన వివరించారు.